క్లుప్తంగా

వసతులు కల్పించాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని సార్క్ హ్యూమన్ రైట్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించాల్సి ఉండగా.. అమలు చేయడం లేదన్నారు.

కార్యవర్గం ఎన్నిక

నార్నూర్: అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అడహక్ కమిటీ గౌరవ అధ్యక్షుడు దుర్గం శేఖర్, సలహాదారుడు శైలేందర్ వాగ్మారేలు స్థానిక బుద్ధవిహార్‌లో సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా నరహరి కాంబ్లే, ఉపాధ్యక్షుడిగా రాజు బామ్నే, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్ లోఖండే, సహాయ కార్యదర్శిగా రమేశ్ వాగ్మారే, కోశాధికారిగా సంతోశ్ మానే, సలహాదారులుగా విజయ్ చాలుార్కర్, తిరుపతి రూడే, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కేశవ్ దుర్గే, సునీల్ ఛాలుార్కర్, పరమేశ్వర్ కోల్టకర్, గౌరవ అధ్యక్షుడిగా కాంతారావు దుర్గేలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయుడిని నియమించాలని వినతి

తాంసి: మండలంలోని పొన్నారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడిని నియమించాలని సర్పంచ్ అశోక్ బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను కలిసి పాఠశాలలో ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ రఘు, పాఠశాల హెచ్‌ఎం సంజీవ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

తాంసి: తాంసి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ కృష్ణ విద్యుత్‌శాఖ ఎస్ఈని సంపత్ కుమార్‌ను కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు జరుగకుండా కంచె ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అరుణ్ కుమార్, తదితరులున్నారు.

తెమడ పరీక్షలు చేయించుకోవాలి

నార్నూర్: దగ్గు, జ్వరం, ఆకలి మందగించిన వారు తెమడ పరీక్షలు చేయించుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్ అన్నారు. బుధవారం నార్నూర్ ప్రభుత్వ దవాఖానాలో తేమడా పరీక్షల శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నిషియన్ రవీందర్, మిరజా, రవీందర్, ఆశ కార్యకర్తలు పుల్లా, అరుణ, చిన్నుతాయి, సుగుణ, హెల్త్ అసిస్టెంట్ బాపురావు పాల్గొన్నారు.

పీవోను కలిసిన ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్

ఉట్నూర్‌రూరల్: ఇటీవల ఉట్నూర్ ఐటీడీఏ పీవోగా బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్‌పాయ్‌ను కుమురం భీం జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి బుధవారం ఐటీడీఏ పీవో క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనప్రాంత, గిరిజనుల అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.

బిల్లులు విడుదల చేయాలి

బేల: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ సమ్మెలో భాగంగా మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల ప్రాంగణంలో కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. యూనియన్ మండల అధ్యక్షురాలు రేఖాబాయి, సభ్యులు సునీత, చంద్రకళ, సక్కుబాయి, లక్ష్మీ, కౌశల్యబాయి, కమల పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల విచారణ

ఆదిలాబాద్‌రూరల్: గత కొన్నేళ్లుగా ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు నిర్మించుకొని ఉంటున్న వారి వివరాల గురించి అధికారులు ఆరా తీశారు. బుధవారం మండలంలోని బంగారుగూడలో విచారణ చేపట్టారు. మైనింగ్ ఏడీ రవి శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న అర్హులైన వారికి 58 జీవో కింద పట్టాలు జారీ చేయడం జరుగుతుందన్నారు. మావల తహసీల్దార్ ఇమ్రాన్, ఆర్ఐ హన్మంత్‌రావ్ ఉన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకే పఠనోత్సవం

తాంసి: పాఠశాల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకే పఠనోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వర్ రెడ్డి, సీసీ రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

రైతులకు 24గంటలు కరెంట్ అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడంతో బుధవారం జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు నిరసనలు చేపట్టారు. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



జైనథ్: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు ఎక్స్‌రోడ్డు వద్ద దహనం చేశారు. తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ శ్రీరాం, దాసండ్ల ప్రభాకర్, ధరణి రాజేశ్, వినోద్, సందీప్ పాల్గొన్నారు.

- బేల: రహదారులపై రైతులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ ఆధ్వర్యంలో, సాంగ్వి(జి) గ్రామంలో ఆదిలాబాద్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ రంగినేని మనీషా పవన్‌రావుల ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఠాక్రే గంభీర్, తదితరులు పాల్గొన్నారు.
- జైనథ్: మండలంలోని భోరజ్ సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డికి రైతులంటే లెక్క లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, సర్పంచ్ లింగారెడ్డి, తుమ్మల వెంకట్ రెడ్డి, మద్దుల ఊషన్న, చంద్రయ్య పాల్గొన్నారు.
- నేరడిగొండ: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జెడ్పీటీసీ అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. రేవంత్ రెడ్డి తన నిజస్వరూపాన్ని బయట పెట్టుకున్నాడని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ శివారెడ్డి, ఏలేటి మహేందర్ రెడ్డి, సర్పంచ్ పెంట వెంకటరమణ, జహీర్, పండరీ, రమేశ్ పాల్గొన్నారు.
- బోథ్: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు. కాంగ్రెస్ రైతులపై సవతి ప్రేమ చూపిస్తుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్ సింగ్, వైస్ చైర్మన్ సంజీవ్ రెడ్డి, మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ లింబాజీ, ఎల్క రాజు, లోలపు పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.
- తాంసి: కాంగ్రెస్ రైతులపై కపట ప్రేమ చూపుతుందని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. తాంసి, భీంపూర్ మండల కేంద్రంలో మేరకు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. మండల కన్వీనర్ అరుణ్ కుమార్, గోవర్ధన్, వైస్ ఎంపీపీ రఘు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, భీంపూర్ కన్వీనర్ నాగయ్య, జెడ్పీటీసీ సుధాకర్, అనిల్, భీంపూర్ సర్పంచ్ లింబాజీ పాల్గొన్నారు.



ఉట్నూర్‌రూరల్: నినాదాలు చేస్తున్న నాయకులు



నేరడిగొండ: నిరసన తెలుపుతున్న నాయకులు



బేల: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



తాంసిలో..



బోథ్‌లో..

'రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకోం'



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కేసీఆర్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: టీపీసీసీ రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకోమని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటాన్ని దహనం చేశారు. బీఆర్‌ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు ముఖడే ఉత్తం, మహ్మద్ జహీర్, సోమసే వెంకట్‌రావ్, భగవాన్, జితేందర్, ప్రకాశ్, ఆత్రం కల్యాణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: రేవంత్ రెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఉచిత కరెంట్, రుణమాఫీ, ఎరువులు ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖయ్యుం, ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ బిరుదుల లాజర్, దూట రాజేశ్వర్, సలీం, దేవానందం, ఇమ్రాన్, జైవంత్ పాల్గొన్నారు.



బోథ్: సొనాల సబ్‌స్టేషన్ వద్ద

బోథ్: మండలంలోని సొనాల సబ్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేశ్ బత్తుల, పట్టణ అధ్యక్షుడు చెట్లపెల్లి అనిల్, గుడాల శేఖర్, కురుమ శంకర్, భాస్కర్ రెడ్డి, తులసీ రామ్, చందు, రాజేశ్వర్ పాల్గొన్నారు.

కాలనీ ఏర్పాటు చేయాలని ధర్నా

కైలాస్‌నగర్: పట్టణ భవన నిర్మాణరంగ కార్మికుల కాలనీ ఏర్పాటు కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం భవన నిర్మాణ రంగ కార్మికులు జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. కార్మిక సంఘ భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యాలయంలోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. తొమ్మిదిన్నర ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. పట్టణ శివారులో వందల ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉందని, దాన్ని కార్మికులకు కేటాయించాలన్నారు. 15 రోజుల్లోగా సమస్య పరిష్కరించకపోతే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు బండారి పోశన్న, బీజేపీ నాయకులు జ్యోతిరెడ్డి, ఆకుల ప్రవీణ్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

'హామీలు నెరవేర్చడంలో విఫలం'

జైనథ్: హామీలతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం, అమలు విఫలమైందని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోని ఆనంద్‌పూర్, కూర, కరంజి గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ.. కాంగ్రెస్ డిక్లరేషన్‌లపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్లు, లక్ష రూపాయల రుణమాఫీ, కొత్త రేషన్ కార్డులు, అర్హులకు దళితబస్తీ భూములు వంటి ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమి లేదని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో జోగు రామన్నకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సంతోశ్, షకీల్, అల్లూరి అశోక్‌రెడ్డి, మనోజ్, వసీమ్, తదితరులు పాల్గొన్నారు.



కరంజిలో ర్యాలీ నిర్వహిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

అర్హులకే ఇంటి స్థలాల పంపిణీ

నేరడిగొండ: ఇళ్ల స్థలాలు లేని అర్హులకే ఇంటి స్థలాలు పంపిణీ చేస్తామని ఆర్డీవో రమేశ్ రాథోడ్ అన్నారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెంట వెంకటరమణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇంటి స్థలాల కోసం 463 మంది దరఖాస్తు చేసుకోగా.. వాటిని పరిశీలించి, ఇంటింటికీ తిరుగుతూ పకడ్బందీగా సర్వే చేపట్టారు. 124 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించి ఎంపిక చేశారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల పేర్లను గ్రామపంచాయతీ నోటీసు బోర్డుపై ఉంచమన్నారు. ఎవరికైన అభ్యంతరం ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చనని సూచించారు. తహసీల్దార్ పవన్ చంద్ర, ఆర్ఐ నాగారావు, సంతోశ్‌సింగ్, రాజశేఖర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో రాథోడ్ రమేశ్

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కైలాస్‌నగర్: గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ సందర్శించి మద్దతు తెలిపారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులు చేసే పోరాటానికి బీజేపీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద పంచాయతీ కార్మికులు చేస్తున్న దీక్షలకు పలు పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు నాసర్ అహ్మద్, ఎంపీటీసీ రజియా బేగం, సల్ల రవిలు కార్మికులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. బీజేపీ నాయకులు గొర్ల రాజు యాదవ్, కట్ట భూమేశ్‌లు వారికి సంఘీభావం ప్రకటించారు. నాయకులు శ్రీకాంత్, హరికృష్ణ, సాయి రోహిత్, భిక్క రమేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు లింగాల చిన్నన్న డిమాండ్ చేశారు. బుధవారం మండల వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాలు ఏడో రోజుకు చేరింది. కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మార్కెట్లో నిత్యావసర ధరలు పెరిగి నిరుపేదలు బతకడం కష్టంగా మారిందన్నారు. కార్మికులకు ప్రస్తుతం ఇచ్చే వేతనం సరిపోవడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రాచకొండ పోశెట్టి, ఉపాధ్యక్షుడు కుంచం భోజన్న, రామంచ రాజేశ్వర్, గజ్జల అశోక్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

'గ్రూప్ రాజకీయాలు సరికాదు'

ఉట్నూర్‌రూరల్: ఒకే పార్టీలో ఉంటూ, గ్రూపు రాజకీయాలు చేయడం సరికాదని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ చేసిన ఆరోపణలను ఆమె ఖండించారు. బుధవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. సీనియర్ నాయకుడు భరత్ చౌహాన్ పార్టీ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి అని అలాంటి వ్యక్తికి వ్యతిరేకంగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. జెడ్పీటీసీగా, జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలిగా కొనసాగుతూ.. ఆదరణను చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించుకోవాలే కాని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ చిల్లర రాజకీయాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్బాల్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, పెందూర్ ప్రభాకర్, మల్లారెడ్డి, జావిద్, నెదునూరి అశోక్, కలీం పాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ చారులత రాథోడ్

సత్యాగ్రహ మౌనదీక్ష

ఉట్నూర్‌రూరల్: గాంధీభవన్లో చేస్తున్న సత్యాగ్రహ మౌన దీక్షకు మద్దతుగా బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ చారులత రాథోడ్ మౌనదీక్ష చేపట్టారు. కాంగ్రెస్ ఆదరణ చూసి ఓర్వలేక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాహుల్ గాంధీపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ అధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్బాల్, సునీల్ జాదవ్, కోమటిరెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం..

గుడుంబా స్వాధీనం

గుడిహత్నూర్: మండలంలోని నేరడిగొండతండా నుంచి అక్రమంగా తరలిస్తున్న పది లీటర్ల గుడుంబాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ముత్నూర్‌రోడ్డుపై వీరిని అడ్డగించి తనిఖీలు చేయగా వీరి వద్ద గుడుంబా లభించింది. గుడుంబాను తరలిస్తున్న గారులే గోపినాథ్, జి.ఓంకార్, గణేశ్ అనే యువకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

'సొనాల మండల' అభినందన సభ

బోథ్: సొనాలను మండలంగా ప్రకటించడంతో సొనాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం సొనాల మండల అభినందన సభను రైతు వేదికలో నిర్వహించారు. మండల ఏర్పాటు ఉద్యమంలో పాల్గొన్న సభ్యులను సొనాల సర్పంచ్ సదానందం ఘనంగా సన్మానించారు. అందరి సమిష్టి కృషితో మండలం ఏర్పాటైందన్నారు.

బీసీ సంఘ భవనానికి రూ.5 లక్షలు మంజూరు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘ భవనానికి ఆదిలాబాద్ మున్సిపాలిటీ ద్వారా రూ.5లక్షల నిధులు కేటాయించారు. ఈమేరకు నిధుల కేటాయింపు పత్రాలను బుధవారం మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చిక్కాల దత్తు, నాయకుడు నర్సాగౌడ్‌కు అందజేశారు.

సన్మానం

బోథ్: జిల్లాలోనే అత్యధికంగా బోథ్ సీహెచ్‌సీలో 196 కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేసిన వైద్యులు రాజనాల రవీంద్ర ప్రసాద్ ఉత్తమ డాక్టర్ ప్రశంసాపత్రం అందుకున్న సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలో బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్ సింగ్, వైస్ చైర్మన్ సంజీవ్ రెడ్డి, నారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ లింబాజీ, ఎల్క రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ లోలపు పోశెట్టి, రమణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఇంద్రవెల్లి: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు బుక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని గలియబాయితండా, ఏమాయికుంట, పాటగూడ, ముత్నూర్, ధర్మసాగర్, కేస్లాగూడ గ్రామాల్లో పర్యటించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఎం కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వచ్చేలా చూడాలన్నారు. అనంతరం ముత్నూర్ గ్రామంలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

బేల: ఏళ్లుగా సాగు చేస్తున్న పోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధి గ్రామ రైతులతో కలిసి ధర్నా చేశారు. మండల తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జోగు రామన్న ప్రతీ ఎన్నికల ముందు పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీలు ఇచ్చి, తరువాత విస్మరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, ఎంపీటీసీ ఓల్లఫ్‌వార్ జ్యోతి, యూత్ నాయకులు బర్కాడే రాము, శివకిరణ్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న చిట్యాల సుహాసినిరెడ్డి

నేటి నుంచి ఉపాధిహామీ సామాజిక తనిఖీలు

నేరడిగొండ: మండల వ్యాప్తంగా 2021- 22 నుంచి 2022- 23 సంవత్సరం మార్చి వరకు మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకంలో దాదాపు రూ.14 కోట్లతో చేపట్టిన పనులకు గురువారం నుంచి సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ సమద్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, డీఆర్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంజూరైన నిధులు, చేపట్టిన పనుల గురించి వివరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. సామాజిక తనిఖీల కోసం గ్రామాలకు వచ్చిన డీఆర్పీలకు ఉపాధిహామీ సిబ్బంది సహకరించాలని సూచించారు. తనిఖీలు పూర్తి అయ్యాక గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజలకు వివరిస్తామన్నారు. సమావేశంలో ఏపీవో వసంత్ రావు, ఎస్ఆర్‌పీ కొమురయ్య, డీఆర్పీలు, టీఏలు, ఎఫ్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థినులకు చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని లోకారి, పిప్పల్‌ధరి, మామిడిగూడ, చించుఘాట్ (గిరిజన ఆశ్రమ పాఠశాల బాలికలు), దివ్యగూడ గ్రామాల్లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. చదువుకునే వయస్సులో పనికి పంపించడం చట్టరీత్యా నేరమన్నారు. పెళ్లి వయస్సు రాక ముందు పెళ్లి చేయవద్దన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న క్షమాదేశ్‌పాండే

విద్యాసంస్థల బంద్ విజయవంతం

బోథ్: ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణ చట్టం అమలు, విద్యార్థులందరికీ ఉచిత బస్సు పాసులు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, స్కాలర్‌షిప్‌ల విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాలలు, కళాశాలల బంద్ విజయవంతం అయింది. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా, ప్రేమ్, మున్సిఫ్, నరేశ్, సంతోశ్, వెంకట రమణ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

ఇంద్రవెల్లి: మండలంలోని హర్కపూర్ అంద్‌గూడ పరిధిలోని మామిడిగూడ గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలనే సర్పంచ్ కుడే కూలాస్ బుధవారం హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమశాఖ మంత్రిని కలిసి విన్నవించారు. మంత్రి సత్యవతి రాథోడ్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.